సాక్షి
సంగారెడ్డి

బుధవారం ¸ 8 ¸ అక్టోబర్ ¸ 2025



అవగాహనే రక్ష

సైబర్‌నేరాలు పెరిగిపోతుండటంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వివరాలు 8లో ▸



గుట్టు విప్పనున్న అఫిడవిట్

స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎన్నో రహస్యాలు వెల్లడికానున్నాయి. వివరాలు 8లో ▸



బీజేపీ ప్రభావం ఉండదు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ ప్రభావం ఉండదని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ పేర్కొన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వాల్మీకి మార్గంలో నడుచుకోవాలి: ఎస్పీ



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్, తదితరులు

సంగారెడ్డి జోన్: వాల్మీకి చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసుల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

అక్రమ రవాణా జరగకుండా చర్యలు

స్థానిక ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యంతోపాటు డబ్బు అక్రమంగా రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని పరితోశ్ పంకజ్ స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఎన్నికలలో అల్లర్లు సృష్టించిన వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లీగల్ అడ్వైజర్ రాములు, అదనపు ఎస్పీ రఘునందన్ రావు, డీఎస్పీలు సత్తయ్య గౌడ్, వెంకటరెడ్డి, సైదా నాయక్ పాల్గొన్నారు.

పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



సఖి కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డిటౌన్: పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని శిశుగృహ, సఖి కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు క్రమశిక్షణతో ఉంటూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. న్యాయపరమైన విషయంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు మరమ్మతు చేయండి



సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేస్తున్న రవీందర్ నాయక్

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో కురిసిన కుండపోత వర్షాలకు బాగా దెబ్బతిని ప్రమాదకరంగా మారిన రోడ్లు, వంతెనలకు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతూ మంగళవారం ఖేడ్ మాజీ జెడ్పీటీసీ రాథోడ్ రవీందర్ నాయక్ ఖేడ్‌సబ్ కలెక్టర్ ఉమాహారతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రాన్ని సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. సోమవారం కురిసిన కుండపోత వర్షం కారణంగా ఖేడ్-సిర్గాపూర్ మార్గంలోని ర్యాకల్-చల్లగిద్ద తండాల మధ్య రోడ్డుతోపాటు, ర్యాకల్ సమీపంలోని వంతెన వద్ద గొయ్యిపడి ప్రమాదకరంగా మారిందని వివరించారు. ర్యాకల్ నుంచి పోతన్‌పల్లి వైపు వెళ్లే రోడ్డు సైతం బాగా దెబ్బతిందని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు చౌహాన్ సర్దార్ నాయక్, తదితరులు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్ఎస్)కు 2025-26 విద్యాసంవత్సరంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 14వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఎంఈఓ శంకర్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తు ఫీజు ఎస్సీ,ఎస్టీ,వికలాంగులు రూ.50, బీసీలు, ఇతరులు రూ.100 చెల్లించాలని కోరారు. ఎన్ఎంఎంఎస్ఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైతే 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఏటా రూ.12వేలు స్కాలర్‌షిప్ లభిస్తుందని చెప్పారు. డిసెంబర్ 7న రాత పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు.



బంగారు మైసమ్మ మందిరంలో మహిళల సామూహిక కుంకుమార్చన

సామూహిక కుంకుమార్చన

సదాశివపేట(సంగారెడ్డి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా పట్టణంలోని భవసార క్షత్రియ సమాజ్ శ్రీభవాని మందిరంలో, శ్రీబంగారు మైసమ్మ మందిరాల్లో మంగళవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళల సామూహిక కుంకుమార్చన హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ పాటిల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు చింతా సాయినాథ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భవసార క్షత్రియ సమాజ్ శ్రీభవాని మందిరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రజాస్వామ్యంపై దాడి



కోర్టు ఆవరణలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ న్యాయవాదుల నిరసన

సంగారెడ్డి టౌన్: సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్ కిశోర్ దాడి చేయడాన్ని జిల్లా కోర్టులోని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. జస్టిస్ గవాయ్‌పై దాడికి వ్యతిరేకంగా జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ...సీజేఐపై దాడి భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అన్నారు. దేశంలో లౌకికత్వాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో రాజ్యాంగం పెట్టని గోడలా ఉందని, దానిని ధ్వంసం చేయడానికి సనాతన ధర్మం పేరుతో కొన్ని దుష్ట శక్తులు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి న్యాయవాదులు ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. దాడికి యత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసి, దేశంలో ఏ కోర్టులో కూడా వాదించకుండా ఆయన బార్ కౌన్సిల్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్,రామారావు,నారాయణ, కృష్ణ, దర్శన్, సుభాష్ చందర్, నిజాముద్దీన్ రషీద్, శ్రీను నాయక్,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నారాయణఖేడ్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిజస్టిస్‌బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్ కిశోర్ బూటు విసిరి దాడికి యత్నించడాన్ని నిరసిస్తూ ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజిరెడ్డి, కార్యదర్శి నర్సింహారావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


ఎన్నికల ఖర్చుపై నిఘా

జెడ్పీటీసీకి రూ.4 లక్షలు.. ఎంపీటీసీకి రూ.1.50 లక్షలు

- అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పరిమితులు
- మండలస్థాయిలో ఎన్నికల వ్యయంపై సహాయక పరిశీలకులు నియామకం
- అభ్యర్థులు ఎంసీసీని పాటించాలంటున్న అధికారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై నిఘా ఉంటుందని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు. అభ్యర్థులు ఈ ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చుకు వీలు లేదని, ఇందుకు పరిమితులు ఉంటాయని చెబుతున్నారు. జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.4 లక్షలకు మించరాదు. అలాగే ఎంపీటీసీ అభ్యర్థి వ్యయం రూ.1.50 లక్షల లోపు ఉండాలి. ఇక సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు కూడా ఓ లెక్క ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. ఐదు వేల జనాభా లోపు ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి అభ్యర్థి ఖర్చు రూ.1.50 లక్షల లోపు అలాగే వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.30 వేల లోపు ఉండాలి. మరోవైపు ఐదు వేలకు మించి జనాభా ఉన్న గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు బరిలోకి దిగుతున్న అభ్యర్థులకు రూ.2.50 లక్షలు, వార్డు సభ్యునికి ఖర్చు రూ.50 వేలు ఉండాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి చెబుతోంది.

ఖర్చు చేసే ప్రతీ రూపాయి బ్యాంకు లావాదేవీల ద్వారానే జరగాల్సి ఉంటుంది. ఆయా స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసే రోజుకంటే ఒకరోజు ముందుగా ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరవాలి. అభ్యర్థులు ఎప్పటికప్పుడు తమ ఎన్నికల ఖర్చు వివరాలను తెలపాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



లెక్క చూపాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అభ్యర్థులు ఓ స్థాయిలో ఖర్చు చేస్తుంటారు. ప్రధానంగా పట్టణీకరణ ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండలాల్లో అభ్యర్థుల ఖర్చు భారీగానే ఉంటుంది. ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, పోస్టర్లు, కరపత్రాలు, కండువాలు, క్యాప్‌లు, టీషర్టులు వంటి ఖర్చులు ఉంటాయి. జెడ్పీటీసీ అభ్యర్థులు సమావేశాలు సైతం నిర్వహిస్తుంటారు. ఎన్నికల ప్రచారానికి వాహనాలను వినియోగిస్తుంటారు. ఇలా అభ్యర్థులు తాము పెట్టే ఎన్నికల ఖర్చుకు లెక్కలు చూపాలని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల విషయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు పాటించాలని ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి బలరాం 'సాక్షి'తో పేర్కొన్నారు.

పరిశీలకుల నియామకం

స్థానిక సంస్థలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టేందుకు మండల స్థాయిలో సహాయక పరిశీలకులను (అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు) నియమించారు. గెజిటెడ్ అధికారుల నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులను ఈ పరిశీలకులుగా నియమించారు.

రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలకు ఏర్పాట్లు

- మూడు రోజులపాటు పటాన్ చెరులో క్రీడా సంబరాలు
- ఈనెల 16, 17, 18 తేదీల్లో వాలీబాల్, కబడ్డీ క్రీడలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణంలోకి మైత్రి మైదానం కేంద్రంగా ఈనెల 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి స్పోర్ట్స్ క్లబ్ భవనంలో క్రీడల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అండర్ 17 బాలుర వాలీబాల్, అండర్ 14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలను అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 420 మంది క్రీడాకారులతో పాటు 200 వందల మంది వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది క్రీడలలో పాల్గొంటారని తెలిపారు. వీరందరికి మూడు రోజులపాటు భోజనం, వసతి, బహుమతులు సొంత నిధులతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లను సైతం సొంత నిధులతో జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. క్రీడల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, మండల విద్యాశాఖ అధికారులు పీపీ రాథోడ్, నాగేశ్వరరావు నాయక్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌసుద్దీన్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికలకు కేటాయించిన అధికారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ...స్థానిక ఎన్నికలు అందరి కృషితో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్, చిత్రంలో జానకీరెడ్డి, బలరాం

వాల్మీకి ఆశయ సాధనకు కృషి

కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: వాల్మీకి మహర్షి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషిచేసి, అభివృద్ధి దిశగా సాగాలని కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెవెన్యూ, నేషనల్ హైవే అథారిటీ, పరిశ్రమల శాఖ అధికారులతో భూసేకరణపై సమీక్ష నిర్వహించారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్‌తోపాటు ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రయోజనం అందేలా చూడాలన్నారు. రైతులకు చెల్లించాల్సిన నగదు సకాలంలో అందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వివరించారు. సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కాంగ్రెస్‌లో కలహాలు

- ఇన్‌చార్జి మంత్రి వివేక్ వద్దకు 'జహీరాబాద్' పంచాయితీ
- 'స్థానిక'ఎన్నికల వేళ రచ్చకెక్కుతున్న నేతల ఆధిపత్య పోరు
- ఇరువర్గాలను సమన్వయం చేసిన మంత్రి వివేక్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. నేతల మధ్య ఆధిపత్య పోరు ఈ ఎన్నికల సందర్భంగా రచ్చకెక్కుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులను సంసిద్ధం చేసేందుకు మండలాల వారీగా నిర్వహించే సన్నాహక సమావేశాల విషయంలో జహీరాబాద్ నియోజకవర్గంలో రాజుకున్న రచ్చ ఏకంగా రాష్ట్ర అధినాయకత్వమే కలగజేసుకునే పరిస్థితికి చేరింది. ఈ పంచాయితీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి వద్దకు వెళ్లింది. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, ఇతర ముఖ్య నాయకులు ఈ నియోజకవర్గం నాయకులను సమన్వయం చేయాల్సి వచ్చింది.

సస్పెన్షన్ల ప్రకటన చిచ్చు..

జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్ ఇటీవల ప్రకటించారు. ఈ ప్రకటనపై మరో వర్గం భగ్గుమంది. పార్టీ మండల అధ్యక్షుడిని సస్పెండ్ చేసే అధికారం నియోజకవర్గం ఇన్‌చార్జికి ఎక్కడిదని సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి వర్గం ప్రశ్నిస్తోంది. పైగా ఏళ్ల తరబడి పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకుడిని ఈ ఎన్నికల సందర్భంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటిస్తే పార్టీ శ్రేణుల్లో ఎలాంటి సంకేతాలు వెళ్తాయని మండిపడుతోంది. ఒక మండల అధ్యక్షుడిని సస్పెండ్ చేసే అధికారం పీసీసీ అధ్యక్షుడికే ఉంటుంది.



ఏదైనా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు క్రమశిక్షణ కమిటీ నిర్ణయిస్తేనే పీసీసీ అధ్యక్షుడు చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. కానీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎలా సస్పెన్షన్ ప్రకటన ఇస్తారని భగ్గుమంటోంది. నర్సింహారెడ్డిని పార్టీ నుంచి తొలగించలేదని, ఎలాంటి సస్పెన్షన్ ఉండదని మంత్రి వివేక్‌తో జరిగిన సమావేశం అనంతరం నాయకత్వం ప్రకటించింది.

సమన్వయంతో సమావేశాలు..

జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక విషయంలో మండలాల వారీగా సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నియోజకవర్గంలోని నాయకులను ఇన్‌చార్జి మంత్రి వివేక్ సమన్వయం చేయడంతో ఈ సమావేశాలకు ఇప్పుడు చంద్రశేఖర్‌తోపాటు, గిరిధర్‌రెడ్డి కూడా పాల్గొంటున్నారు. ఇటీవల మొగుడంపల్లి మండల సమావేశానికి ఇరు వర్గాల నాయకులు హాజరయ్యారు. అలాగే జహీరాబాద్ మండల సమావేశానికి కూడా రెండు వర్గాల నాయకులు పాల్గొన్నారు.

పాత, కొత్త నేతల మధ్య పోరు

ఈ నియోజకవర్గంలో పాత, కొత్త నాయకుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నాయి. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత పదేళ్లు ఇక్కడ గిరిధర్‌రెడ్డి వర్గం పార్టీని అంటిపెట్టుకుని ఉంటోంది. కాంగ్రెస్ కష్టకాలంలోనూ తాము పార్టీకి అండగా నిలిచామని, తీరా ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులు తమపై ఆధిపత్యం చెలాయించేందుకు చూస్తున్నారని మండిపడుతోంది. ఈ పంచాయితీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వద్దకు వెళ్లడంతో ఇరు వర్గాలను హైదరాబాద్‌లోని తన నివాసానికి పిలిపించి సమన్వయం చేయాల్సి వచ్చింది.

కలిసికట్టుగా పనిచేద్దాం

- గ్రూపురాజకీయాలను పార్టీ ఉపేక్షించదు
- సమావేశంలో పార్టీ నేతలు చంద్రశేఖర్, గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, తన్వీర్‌ల ఐక్యతారాగం
- ఊపిరి పీల్చుకున్న కార్యకర్తలు

జహీరాబాద్: సమిష్టిగా ఎంపిక చేసిన అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం జహీరాబాద్ మండల అభ్యర్థుల ఎంపిక దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీమంత్రి ఎ.చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, ఐడీఎస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్‌లు మాట్లాడారు. తమ మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఎవరైనా అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసినట్లయితే పార్టీ ఉపేక్షించబోదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉందని, ఈ విషయంలో ఎలాంటి తీర్పు వచ్చినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ తరఫున 42% టికెట్లను బీసీలకు కేటాయిస్తామని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం గ్రామ స్థాయిలో ముగ్గురి పేర్లను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. సేకరించిన పేర్లను అధిష్టానవర్గం వద్దకు పంపనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, అడ్‌హాక్‌కమిటీ చైర్మన్ ఎం.జి.రాములు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా, ఎంపీ క్యాంపు కార్యాలయ ఇంచార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు నాగిశెట్టిరాథోడ్, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

ముఖ్య నేతల ఐక్యతారాగం

కాంగ్రెస్ పార్టీ నేతలు ఇటీవల నెలకొన్న విభేదాలకు తెరదించారు. పార్టీ అభ్యర్థుల ఎంపిక సమావేశంలో చంద్రశేఖర్, గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, ఎం.డి.తన్వీర్‌లు ఒకే వేదికపై కూర్చుని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తూ ఐక్యతా రాగం ఆలపించారు. దీంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్. చిత్రంలో గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, తన్వీర్

క్లుప్తంగా

ఇసునాథ్‌కు పీహెచ్‌డీ


ఇసునాథ్‌కు పట్టాను అందిస్తున్న వీసీ బీజే రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలం మధులై తండాకు చెందిన రాథోడ్ ఇసునాథ్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. థియేటర్ ఆర్ట్స్ విభాగంలో కళలపై పరిశోధనలు సమర్పించారు. ఇందుకు గాను ఆయన ఇటీవల యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో వైస్ చాన్సలర్ బీజే రావు చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. గిరిజన బిడ్డ పీహెచ్‌డీ పట్టా అందుకోవడంపై తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

మందుబాబులకు జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో మందుతాగి వాహనం నడుపుతున్న 9 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరు పర్చగా 8 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో వ్యక్తికి జరిమానతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించింది.

సంగారెడ్డిలో ఏడుగురికి..

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డి పల్లి చౌరస్తా, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఏడు మంది పట్టుబడ్డారని ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి నలుగురికి రూ.1500, ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమాన విధించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సదాశివపేట(సంగారెడ్డి): హత్య కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వివరాల ప్రకారం... మండల కేంద్రమైన చౌటకూర్‌కు చెందిన నిందితుడు పెద్దగొల్ల బీరప్ప(32) కుటుంబ కలహాలతో భార్యను వదిలి సదాశివపేటలో దినసరి కూలీగా పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ట్రాక్టర్ బ్యాటరీ దొంగతనం విషయంలో పాపయ్య మరికొందరు బీరప్పను తిట్టి, మూత్రం పోసి అవమానించారు. ఈ విషయంలో కక్ష పెంచుకుని పాపయ్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో 2021 ఆగస్టు 5వ తేదీన తెల్లవారుజామున పట్టణంలోని లక్ష్మీకాంప్లెక్స్ వద్ద నిద్రలో ఉన్న పాపయ్యను బండరాయితో తలపై మోదీ బీరప్ప హత్యచేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి బి.భవానీ చంద్ర నిందితుడు బీరప్పకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఇంట్లోకి చొరబడి.. మహిళపై దాడి చేసి..

ఐదు తులాల పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దుండగుడు


గాయపడిన రాజమణి

దుబ్బాక రూరల్: మహిళపై దాడి చేసి పుస్తెల తాడును ఎత్తుకెళ్లిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ హరీశ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కంకణాల రాజమణి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన జూకంటి మల్లారెడ్డి సోమవారం సాయంత్రం ఆమెపై దాడి చేసి ఐదు తులాల పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. కాగా బాధితురాలు భర్త శంకరయ్య ఉల్లిగడ్డలు అమ్ముకోవడానికి వెళ్లాడు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసే సరికి భార్య రక్తపు గాయాలతో పడి ఉంది. ఆమెను వివరాలు అడుగగా... ఇంటి పక్కన ఉన్న మల్లారెడ్డి వచ్చి మీ ఇల్లు తేమ వస్తుందని చెప్పారని, చూపించమని అడిగాడు. వెనుక నుంచి తలను గోడ కేసి కొట్టి, తూకం వేసే బాటుతో తలపై కొట్టాడని, కింద పడిపోవడంతో మెడలో ఉన్న ఐదు తులాల పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడని చెప్పింది. వెంటనే అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి క్లూస్ టీమ్, సీఐ శ్రీనివాస్ చేరుకుని వేలి ముద్రలు, వివరాలు సేకరించారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

దుబ్బాకటౌన్: పట్టణంలోని టీజీఎస్ ఆర్టీసీ పెట్రోల్ బంక్‌లో కొనుగోలు చేసిన పెట్రోలులో నీరు ఉందని ధర్మాజీపేట గ్రామానికి చెందిన బాబు సోమవారం బంక్ ఎదుట ఆందోళన నిర్వహించిన విషయం విధితమే. ఈ ఘటనపై విచారించేందుకు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ అధికారి అమిత్ కుమార్ మంగళవారం బంక్‌ను తనిఖీ చేశారు. బాధితుడిని, బంక్ సిబ్బందిని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ శాంపిల్స్‌ని సేకరించి, వాటిని ఐవోసీ ల్యాబ్‌లో పరీక్షలకు పంపనున్నట్లు తెలిపారు. పూర్తి ఫలితాలు వచ్చిన అనంతరమే కల్తీ జరిగిందా లేదా అనే విషయాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

అవగాహనే రక్ష

సైబర్ క్రైమ్ జరిగిన గంటలోపు ఫిర్యాదు చేస్తే ఫలితం

- 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి
- జనవరి నుంచి ఇప్పటి వరకు 178 కేసులు
- ఆన్‌లైన్ జాబ్స్, ఫోన్‌కాల్స్‌తో బురిడీ

రోజు రోజుకు సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. అవగాహన ఉంటే సైబర్ ఉచ్చులో పడకుండా ఉంటారని, ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొంటున్నారు.

– పటాన్‌చెరు టౌన్

ఓ పరిశ్రమలో కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు



సాఫ్ట్‌వేర్, ప్రైవేట్, ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారిని సైబర్ నేరగాళ్లు తప్పుదోవ పట్టిస్తున్నారు. అలాగే ఇతర దేశాల్లో ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరించి వారికి ఫోన్ చేసి మీ అబ్బాయి కేసుల్లో ఇరుక్కున్నాడని.. డబ్బులు చెల్లించాలని లింకులు పంపి ఫోన్‌ను హ్యాక్ చేస్తున్నారు. క్రైమ్ జరిగిన గంటలోనే (గోల్డెన్ హావర్) బాధితులు ముందుగా 1930కు కాల్ చేసి సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు సమాచారం ఇవ్వాలి. అలాగే సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం వారి పరిధిలోకి వచ్చే పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయాలి. వెంటనే సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి డబ్బులు రాబట్టే ప్రయత్నం చేస్తారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 178 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. కాగా బాధితులు మొత్తం 4.15 కోట్లు పోగొట్టుకున్నారు.

ఇలా మోసపోతున్నారు..

- పార్ట్ టైం జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ, నగదు ఇన్వెస్ట్ చేయిస్తూ, అధిక డబ్బు సంపాదించవచ్చని.
- ఏటీఎం కార్డు, డెబిట్ కార్డ్ అప్డేట్ చేయాలని వివరాలు సేకరించి బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు మాయం చేస్తున్న ఘటనలు అనేకం.
- ఆన్‌లైన్ ఉద్యోగాలంటూ ఫోన్‌కు వచ్చిన లింకులు క్లిక్ చేసి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్న వారు కొందరు.
- ఫేస్ బుక్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటనలు క్లిక్ చేసి ఖాతాలు ఖాళీ చేసుకుంటున్నారు.

కొన్ని ఘటనలు

- పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెప్టెంబర్ 15న తన ఫోన్‌కు టాస్కులు చేస్తే కమీషన్ ఇస్తామని గుర్తుతెలియని మహిళ నుంచి మెసేజ్ వచ్చింది. దానికి స్పందించి తన వివరాలు నమోదు చేయగా... వారు వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి నగదు చెల్లించి టాస్కులు చేశాడు. దీంతో బాధితుడు మొత్తం రూ.47 లక్షల 67 వేలు చెల్లించాడు. కాగా పెట్టిన నగదును ఇవ్వాలని అడగగా అవుతలి నుంచి స్పందన లేదు.
- ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన ఓ వ్యక్తికి సెప్టెంబర్ 19న గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పాడు. దీంతో బాధితుడు కార్డు వివరాలు చెప్పాడు. లిమిట్ పెంచామని.. మీకు ఓటీపీ వస్తుంది అది చెప్పాలని సూచించాడు. నిజమని నమ్మి చెప్పగా వెంటనే అతడి ఖాతా నుంచి రూ. రెండు లక్షల 19 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది.

అవగాహన కల్పిస్తున్నాం



బాధితులు గోల్డెన్ అవర్‌లోనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుంది. దోచుకున్న నగదును బ్లాక్ చేస్తారు. సైబర్ నేరాలపై విద్యాసంస్థల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– వేణుగోపాల్ రెడ్డి, డీఎస్పీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో

వేధింపులు భరించలేకే హత్య

- రౌడీషీటర్ హత్యకేసులో ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): రౌడీషీటర్ హత్యకేసులో వరుసకు సోదరులైన వారే నిందితులని పోలీసులు తేల్చారు. ఈ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా చిన్నశంకరంపేట మండలం శాలిపేటలో సోమవారం హత్య జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. శాలిపేట గ్రామానికి చెందిన ఉప్పరి యాదగిరి (46)కి గతంలో కొన్ని కేసులతో సంబంధం ఉంది. వరుసకు సోదరులైన ఉప్పరి శ్యాములు, ఉప్పరి రాములు, ఉప్పరి ఎల్లంను తరచూ వేధింపులకు గురిచేస్తూ చంపుతానని యాదగిరి బెదిరించేవాడు. దీంతో అతడు జీవించి ఉంటే తమను బతుకనివ్వడని, ఎలాగైనా హతమార్చాలని ముగ్గురు కలిసి మూడు రోజుల క్రితం కల్లు దుకాణంలో ప్లాన్ చేశారు. అదే రోజు అతని కోసం గాలించగా దొరకలేదు. సోమవారం ముగ్గురు నిందితులు కల్లు దుకాణంలో కల్లు తాగిన అనంతరం నేరుగా యాదగిరి ఇంటికి వెళ్లారు. ఇంటిముందు ఉన్న అతడ్ని పట్టుకుని కింద పడేసి తలపై బండరాళ్లతో బాది హతమార్చారు. చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం అక్కడినుంచి వెళ్లిపోయారు. ముగ్గురు నిందితులు పారిపోతున్న క్రమంలో గవ్వలపల్లి చౌరస్తా వద్ద స్థానిక సీఐ వెంకట్‌రాజాగౌడ్ పట్టుకొని విచారించగా, నిందితులు నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

లక్షలాది రైతులకు పత్తి జీవనాధారం


పత్తి పై అవగాహన కల్పిస్తున్న భాస్కర్

దుబ్బాకటౌన్: పత్తి పంట ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది రైతులకు జీవనాధారమవుతుందని, వ్యవసాయం నుంచి వస్త్ర పరిశ్రమ వరకు అనేక రంగాల్లో ఉపాధి కల్పిస్తుందని భారత నవ నిర్మాణ సంస్థ కో ఆర్డినేటర్ దాతర్ పల్లి భాస్కర్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచ వాణిజ్య సంస్థ 2019లో మొదటిసారి ప్రపంచ పత్తి దినోత్సవం ప్రారంభించిందన్నారు. పత్తితో మనకు వస్త్రాలు మాత్రమే కాకుండా, విత్తన నూనె, పశువుల ఆహారం వంటి అనేక ఉత్పత్తులు లభిస్తున్నాయని గుర్తు చేశారు. పత్తి సహజమైన పంట కావడం వల్ల పర్యావరణానికి మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కల్పన, ఫీల్డ్ ఫెసిలిటేర్స్ కరుణాకర్, శ్రీకాంత్, వినోద్ రెడ్డి తదితరులున్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ ఎడమ చేతి చూపుడు వేలికి, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎడమ చేతి మధ్య వేలికి సిరా వేయాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం ఎన్నికల్లో ఉపయోగించే సిరా, ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ఎన్నికలకు అనుసరించాల్సిన ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) గురించి, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, సిబ్బంది పాటించాల్సిన మార్గదర్శకాల గురించి వివరించారు. పార్టీలు, అభ్యర్థులు అనుమతి పొందకుండా ఊరేగింపులు, బహిరంగ సమావేశాలు, లౌడ్ స్పీకర్ల వాడొద్దని సూచించారు. అలాగే జాతులు, కులాలు, మతాలు, భాషల మధ్య విభేదాలు సృష్టించే కార్యక్రమాల్లో పాల్గొనరాదని తెలిపారు. పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారం నిలిపివేయాలని సూచించారు.

హత్యా... ఆత్మహత్యా?

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామ శివారులో మహేందర్ (42)ను హత్య చేసి కాలువలో పడేశారు. మొదట గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా ప్రాథమికంగా పోలీసులు భావించి శవాన్ని కాలువలోంచి బయటకు తీశారు. విశ్వసనీయ సమాచారం మేరకు హత్య చేసి కాలువలో పడేసి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారా అని పోలీసులు ఆరా తీసినట్లు సమాచారం. దీనిపై పోలీసులు మాత్రం ఎలాంటి విషయాన్ని ధ్రువీకరించలేదు.

వర్క్‌షాప్‌లో అగ్ని ప్రమాదం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని వర్క్‌షాప్‌లో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... రామాయంపేట రోడ్డులోని డీఆర్ ఇంజనీరింగ్ వర్క్‌షాపులో వెల్డింగ్ పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించగా విద్యుత్ సరఫరాను నిలిపేసి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని యజమాని ముస్తాఫా తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


రాజేశ్

మిరుదొడ్డి(దుబ్బాక): యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని మల్లుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సమత కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన మాల చిన్న నాగరాజు కుమారుడు రాజేశ్ సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేదు.

మతిస్థిమితం లేని వృద్ధుడు


నారాయణరెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): వృద్ధుడు అదృశ్యమైన ఘటన బొల్లారం పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన కాశిరెడ్డి నారాయణరెడ్డి (55) సోమవారం అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసినవారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడికి మతిస్థిమితం లేదని, ఎక్కడైనా కనిపిస్తే 9989921149, 9573588106 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి


వివేక్


హైవేపై ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

హుస్నాబాద్: ఓ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని జిల్లెల్లగడ్డ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నంగునూరు గ్రామానికి చెందిన సనాధుల వివేక్ (13) 8వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం విద్యార్థి సోమవారం పాఠశాలకు వచ్చాడు. మంగళవారం ఉదయం బ్రేక్ ఫాస్ట్ అయిన తర్వాత వివేక్ పాఠశాలలోని రెండో అంతస్తులో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో క్లీనింగ్ చేసి ఫ్లోర్ పదునుగా ఉండటంతో జారిపడి ప్రమాదవశాత్తు రెయిలింగ్‌కి ఉన్న నైలాన్ దారం తన మెడకు చుట్టుకుందని.. ఉపాధ్యాయులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా వివేక్‌ది హత్య అని, ఉపాధ్యాయులు పొంతన లేని సమాధానం చెబుతున్నారని మృతుని తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం హుస్నాబాద్ – హన్మకొండ హైవేపై ధర్నా చేశారు. ఘటనా స్థలానికి ఏసీపీ సదానందం చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కాగా విద్యార్థి మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు


మహ్మద్ ఆషిక్‌అలీ

జహీరాబాద్: ఈతకు వెళ్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మహ్మద్ ఆషిక్‌అలీ(42) సోమవారం ఈత కొట్టేందుకు వ్యవసాయ బావిలోకి దిగాడు. నీటిలో మునిగి పోయిన విషయాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఏడు కరెంటు మోటార్లను బిగించి నీటిని తోడుతున్నారు. బావిలో నీటిఊటలు అధికంగా ఉండడంతో మృతదేహం లభ్యం కాలేదు. తాగిన మైకంలో నీటిలో మునిగి పోయాడా లేక ఫిట్స్ వచ్చిన కారణంగా మునిగిపోయాడా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసు, రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు సందర్శించి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వట్‌పల్లి(అందోల్): యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. జోగిపేట సీఐ అనీల్‌కుమార్ వివరాల ప్రకారం... అందోలు మండలం రాంసానిపల్లి గ్రామానికి చెందిన నరేశ్ (21) ఓ గ్రామానికి చెందిన బాలికతో పరిచయం పెంచుకుని సెల్‌ఫోన్‌లో చాటింగ్ చేసుకుంటున్నారు. ఈనెల 4న మెమో తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బాలిక బయటకు వచ్చింది. సాయంత్రం ఆరు గంటల వరకు కూడా ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి బాలికను నరేశ్ బైకుపై తీసుకువచ్చి ఆమె ఇంటికి దగ్గరలో వదిలి పెట్టి వెళ్లిపోయాడు. బాలిక భయంతో ఇంట్లోకి వెళ్లకుండా పక్కనే ఉన్న పశువుల పాకలో రాత్రంతా ఉండి పోయింది. ఉదయం ఆమె మామ చూసి ఎందుకు ఇలా ఉన్నావని అడగగా నరేశ్ అనే వ్యక్తి అత్యాచారం చేసినట్లు బాలిక చెప్పింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు నరేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు.

వర్షంతో కోతకు గురైన రోడ్డు

కల్హేర్–పిట్లం మధ్య నిలిచిన రాకపోకలు


కల్హేర్–పిట్లం మధ్యలో వరదనీటితో కోతకు గురైన రోడ్డు

కల్హేర్(నారాయణఖేడ్): భారీ వర్షం కారణంగా జిల్లా సరిహద్దులో కల్హేర్–పిట్లం మండల కేంద్రాల మధ్య రోడ్డు తెగిపోయింది. ఆదివారం రాత్రి నుంచి కుండపోతగా కురిసిన వర్షంతో కల్హేర్ సమీపంలో మహరాజ్ వాగు వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో ఫలితంగా వరద ప్రభావంతో రోడ్డు కోతకు గురైంది. మంగళవారం నుంచి కల్హేర్ నుంచి కామారెడ్డి జిల్లా పిట్లం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు తప్ప ఇతర వాహనాలు వెల్లడం లేదు. ఫలితంగా పిట్లం, బాన్స్‌వాడ, కామారెడ్డి, బోధన్, నిజామాబాద్, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు త్వరగా మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

కాపర్ వైర్ చోరీ

అక్కన్నపేట(హుస్నాబాద్): ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్‌వైరును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని కట్కూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామ శివారులోని రెండు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి గుర్తు తెలియని వ్యక్తులు అందులోని 45కిలోల కాపర్ వైర్‌ను చోరీ చేశారు. వాటి విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. లైన్‌ఇన్‌స్పెక్టర్ నరసింహా రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టాస్కులు, కమీషన్‌ల పేరుతో మోసం

రూ. 54 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ ఉద్యోగి భారీ నగదును పోగొట్టుకున్నాడు. క్రైమ్ సీఐ రాజు వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్‌లోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టాస్కులు, కమీషన్ పేరుతో సెప్టెంబర్ 15న కాల్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి నమ్మి తన వివరాలు నమోదు చేశాడు. అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ వస్తుందని చెప్పి నమ్మించారు. దీంతో సదరు ఉద్యోగి పలు దఫాలుగా రూ.54 లక్షల 67 వేలు పెటుబడి పెట్టగా వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. చివరిగా ఉద్యోగి తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం, పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బయటపడిన పురాతన శిల్పాలు

వెల్లడించిన చరిత్ర పరిశోధకుడు సంతోష్


పురాతన శిల్పాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు హనుమాన్ బండల్ మంజీరా తీరంలో పురాతన శిల్పాలు బయటపడ్డాయని లైబ్రేరియన్, చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కిష్టాపూర్ గ్రామ నివాసి యూసుఫ్ ఇచ్చిన సమాచారం మేరకు మంజీరా తీరం వెంట ఉన్న శిల్పాలను పరిశీలించారు. శిల్పాల్లో అష్టభుజ మహిషాసుర మర్దిని అమ్మవారి శిల్పంతో పాటు నాగిని శిల్పాలు ఉన్నాయని చెప్పారు. చారిత్రక సంపదను కాపాడుకోవాలని, శిల్పాలను అన్నింటిని ఒక్కచోట చేర్చి మ్యూజియం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

గుట్టు విప్పనున్న అఫిడవిట్

- అభ్యర్థులు తప్పనిసరిగా దాఖలు చేయాల్సిందే
- ఆస్తులు, అప్పులు తదితర వివరాలు పొందుపర్చాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ


మెదక్ జెడ్పీ కార్యాలయం

మెదక్ కలెక్టరేట్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో మంది రాజకీయ నాయకుల గుట్టు బయట పెట్టనున్నాయి. ఇప్పటి వరకు ప్రజలు తెలియకుండా దాచిపెట్టిన అన్ని రహస్యాలను ఎన్నికల అఫిడవిట్ బయట పెట్టనుంది. అసెంబ్లీ, శాసనమండలి, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థుల నుంచి అఫిడవిట్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల సంఘం ఈ సారి స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను పక్కాగా తెలుసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అఫిడవిట్ షీట్ అందజేయనున్నారు. అందులో అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలకు సంబంధించిన ఇద్దరు సాక్షులు ధ్రువీకరించిన స్వీయ ప్రకటన (అఫిడవిట్)ను నామపత్రంతో పాటు దాఖలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.

విధిగా సమర్పించాల్సిందే..

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్, పంచాయతీ వార్డుకు పోటీ చేసే అభ్యర్థులు నేరపరంగా పూర్వాపరాలు, సివిల్, క్రిమినల్ కేసులు, విధించిన శిక్షలు, కోర్టుల్లో పెండింగ్ కేసుల వంటి వివరాలతో పాటు స్థిర, చరాస్తులు, అప్పులు, విద్యార్హతలు విధిగా సమర్పించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్థి తనతోపాటు కుటుంబ సభ్యులైన భార్య, కుమార్తె, కుమారుడికి సంబంధించిన వివరాలు పొందుపర్చాలి.

తిరస్కరణకు గురవుతారు

నామపత్రంతో పాటు అందించే ధ్రువీకరణ పత్రంలో గడిని ఖాళీగా వదిలేయకూడదు. తనకు వర్తించదని, లేదా నదారత్ అని రాయాలి. లేకుంటే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది. కుమార్తెకు వివాహమైతే ఆమె వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదు. కుమారుడికి వివాహమైతే కోడలి వివరాలు పేర్కొనాలి. కుమారుడు, కోడలు కుటుంబం విడిగా నివసిస్తుంటే అవసరం ఉండదు.

వివరాలు తప్పుగా ఉంటే కేసులు..

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా అన్ని వివరాలు సమర్పించాలి. అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం నేర చరిత్ర, ఆస్తులు, అప్పుల వివరాలు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అదే రోజు ప్రదర్శిస్తుంది. అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ తప్పుగా ఉన్నట్లు రుజువైతే ఎన్నికల సంఘం క్రిమినల్ కేసు నమోదు చేస్తుంది.